క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం ఇచ్చిన దాతలకు రసీదు ఇస్తున్న గ్రామపెద్దలు

రాయదుర్గం రూరల్: మండలంలోని బొందన కల్లు(రాతిబావి వంక) గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్, మరియమ్మ యాడి ఆలయ నిర్మాణం కోసం ఇద్దరు వ్యక్తులు ఆదివారం రూ.2.75 లక్షల విరాళమిచ్చి దాతృత్వాన్ని చాటుకున్నారు. డాక్టర్ పురుషోత్తంనాయక్ రూ.1,75,00, లోకేశ్వర్‌నాయక్ రూ.1,00,116 విరాళమిచ్చారని గ్రామపెద్దలు హరిశ్చంద్రనాయక్, హేమ్లానాయక్ తెలిపారు. కార్యక్రమంలో బాలాజీనాయక్, ఎంకానాయక్, నందునాయక్, నరేంద్రనాయక్, జయరాంనాయక్, చెన్నునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు



రికార్డులను తనిఖీ చేస్తున్న ఏఓ సాయికుమార్

బొమ్మనహాళ్: ఎరువులు, రసాయన మందులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయాధికారి సాయికుమార్ హెచ్చరించారు ఆదివారం మండలంలోని ఉంతకల్లు, బొమ్మనహాళ్ తదితర గ్రామాల్లోని ఎరువులు, రసాయన మందుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఏఓ మాట్లాడుతూ ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలన్నారు. బిల్లులు ఇవ్వకుండా ఎరువులు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

రెడ్ల సంక్షేమానికి కృషి

కణేకల్లు: రెడ్ల సంక్షేమానికి కృషిచేస్తానని కణేకల్లు పట్టణ ఆ సంఘం అధ్యక్షుడు పి.హరినాథ్‌రెడ్డి అన్నారు. కణేకల్లులోని హనుమంతరెడ్డి ఫంక్షన్‌లో ఆదివారం రెడ్ల సంఘం సమావేశం నిర్వహించారు ఈసందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవకంగా ఎన్నుకున్నారు. పట్టణాధ్యక్షుడిగా పి.హరినాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా నరసింహారెడ్డి, వై.చంద్రమోహన్‌రెడ్డి, గౌరవాధ్యక్షులుగా అయోధ్యరామిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, కార్యదర్శిగా రామ్మోహన్‌రెడ్డి, ఇతర సభ్యులు ఎన్నికయ్యారు.

వైభవంగా డిండి ఉత్సవం



పాండురంగ స్వామి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భావసార క్షత్రియ సమాజ్ కులస్తులు

ఉరవకొండ: ఆషాడమాసం పురస్కరించుకుని నియోజకవర్గంలోని భావసార క్షత్రియ సమాజ్ కులస్తుల ఆధ్వర్యంలో డిండి ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక విఠల్ రుక్మిణి ఆలయం నుంచి కోలటాలు, భజనలు చేస్తు ప్రత్యేక వాహనంపై పాండురంగస్వామి చిత్రపటాన్ని ఊరేగించారు. క్లాక్‌టవర్ మీదుగా తిరిగి ఊరేగింపు విఠల్ రుక్మిణి ఆలయానికి చేరుకుంది. భావసార క్షత్రియ సంఘం అధ్యక్షులు ఈశ్వర్‌రావు, కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఉట్టికొట్టే ఉత్సవం నిర్వహించారు. అనంతరం విఠల్ రుక్మిణి స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు.

యాదవ సంఘం యువజన అధ్యక్షుడిగా ఎర్రిస్వామి

కూడేరు: యాదవ్ సంఘం జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా మండలంలోని చోళసముద్రానికి చెందిన సుద్దుల ఎర్రిస్వామి(వైఎస్సార్ సీపీ నేత) ఎంపికయ్యారు. ఆదివారం ఆయన ఈ విషయాన్ని విలేకరులకు తెలిపారు. యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గురునాథ్ రావు యాదవ్ నియామక పత్రాన్ని అందజేశారన్నారు. యాదవ కులస్తుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

పద్మశాలీయ సంఘంలో 'దుర్గం'వాసులు



ప్రమాణ స్వీకారం చేసిన గోవిందరాజులు, ధనార్జున, రామస్వామి తదితరులు

రాయదుర్గంటౌన్: రాయలసీమ ప్రాంతీయ పద్మశాలీయ సంఘం కార్యవర్గంలో పట్టణానికి చెందిన పద్మశాలి సంఘం తరుపున ముగ్గురిని నియమించారు. ఆ సంఘం కార్యదర్శులుగా పొరాళ్ల గోవిందరాజులు, మహేశుల రామస్వామి, సంయుక్త కార్యదర్శిగా పొరాళ్ల ధనార్జున, సభ్యులుగా వరదా శ్రీనివాసులు ఎన్నికయ్యారు. ఆదివారం కర్నూలులో అఖిల భారత పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి ఆధ్వర్యంలో ప్రమాణం స్వీకారం చేశారు.

'దుర్గం'పై సైబర్ ముఠా కన్ను!

- మీ సేవ, బ్యాంక్ సేవా కేంద్రాలే టార్గెట్
- ఫోన్ పే, గూగుల్ పే వేయిస్తామంటూ మోసాలు
- మూడు నెలల వ్యవధిలోనే నాలుగు సంఘటనలు



సైబర్ మోసాలకు పాల్పడిన అనుమానిత వ్యక్తి సీసీ టీవీ ఫుటేజీ దృశ్యం

కళ్యాణదుర్గం: పట్టణంలోని అమాయక ప్రజలపై కర్ణాటక సైబర్ ముఠా కన్ను పడింది. రద్దీగా ఉన్న మీ సేవ కేంద్రాలు, బ్యాంక్ మిత్ర (బ్యాంక్ సేవా కేంద్రాలు)పై టార్గెట్ పెట్టారు. గడచిన మూడు నెలల్లోనే నాలుగు సంఘటనలు కళ్యాణదుర్గంలో జరిగాయంటే కర్ణాటక సైబర్ ముఠా ఏ స్థాయిలో మోసాలకు పాల్పడుతుందో అర్థమవుతోంది.

ఫోన్ పే, గూగుల్ పేలో నగదు వేయిస్తామంటూ మోసం

కర్ణాటక సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు తెర లేపారు. తాము కూలి పనులు చేసుకునేవాళ్లమని, తమ కుటుంబాల్లో వ్యక్తులు అనారోగ్యం బారిన పడ్డారని. తమ మేస్త్రీ అకౌంట్ నుంచి మీకు ఫోన్ పే, గూగుల్ పే చేస్తారని డబ్బు ఇవ్వాలంటూ ప్రాధేయపడతారు. నిర్వాహకులు లేవన్నా కూడా....అక్కడే తిష్ట వేసి అమాయకంగా అడుగుతూ ఒప్పుకునేలా చేస్తారు. అనంతరం సైబర్ ముఠా సభ్యుడికి ఇక్కడి నిర్వాహకుల ఫోన్ నంబర్లు చెప్పి డబ్బు వేయించుకుంటారు. నిర్వాహకులకు డబ్బు తమ అకౌంట్లో జమ కాగానే అజ్ఞాత వ్యక్తులకు నగదు ఇచ్చి మోసపోతున్నారు. ఇలా మూడు నెలల్లోనే నాలుగు ఘటనలు కళ్యాణదుర్గంలో జరగడం కొసమెరుపు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మీ సేవా, బీసీ కేంద్రాల నిర్వాహకులు సుమారు రూ.2.50 లక్షలు మోసపోయినట్లు తెలుస్తోంది.

సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడిన ఘటనలు ఇలా...

- రెండు నెలల క్రితం మేడా వీధిలోని స్టేట్ బ్యాంక్ పక్కన బ్యాంక్ సేవా కేంద్రాన్ని నడుపుతున్న దివ్యాంగుడు బాలకృష్ణ వద్ద ఓ కర్ణాటక ప్రాంతానికి చెందిన వ్యక్తి రూ.25 వేలు ఫోన్ పే చేయించి నగదు తీసుకున్నాడు. అవతలి వ్యక్తి ఎవరన్నది వివరాలు తెలుసుకోకుండానే నిర్వాహకుడు తనకు డబ్బు వచ్చిందన్న కారణంతో గుర్తు తెలియని వ్యక్తికి నగదు ఇచ్చి పంపాడు. మరుసటి రోజు ఉదయమే తన అకౌంట్ లాక్ చేశారు. అవాక్కయిన బాలకృష్ణకు కర్నాటక పోలీసులు ఫోన్ చేసి హ్యాక్ చేసిన అకౌంట్ నుంచి వచ్చిన డబ్బు డ్రా చేశావని, వెంటనే వచ్చి కట్టిపోవాలని ఆదేశించారు. దీంతో చేసేదేమీలేక నానా తిప్పలు పడి కర్ణాటకకు వెళ్లి డబ్బు కట్టి బ్యాంక్ అకౌంట్ యాక్టివ్ చేయించుకున్నాడు.
- ఇదే తరహాలో నెల క్రితం ఆర్టీసీ బస్టాండ్ వద్ద మరో స్టేట్‌బ్యాంక్ బీసీ పాయింట్ నిర్వాహకుడు తిప్పేస్వామి వద్దకు ఓ అజ్ఞాత వ్యక్తి వచ్చి డబ్బు అవసరం ఉందని, మా బంధువులు నీ ఫోన్ నంబర్‌కు ఫోన్ పే చేస్తారంటూ చెప్పి రూ.75 వేలు ఫోన్ పే చేయించాడు. సేమ్ సీన్ రిపీట్...సైబర్ పోలీసులు బ్యాంక్ అకౌంట్ బ్లాక్ చేయడం, ఫోన్ చేయడం జరిగిపోయాయి.
- నెల క్రితం కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన ఓ ప్రైవేట్ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడి దగ్గర కూడా రూ.50 వేలు సైబర్ ముఠా సభ్యులు ఇదే తరహాలో మోసం చేసినట్లు సమాచారం.
- అదేవిధంగా జూన్ 10న పట్టణంలోని రద్దీగా ఉండే బాబు మీ సేవా కేంద్రంలో ఓ వ్యక్తి వచ్చి తన కుటుంబంలో ఒకరికి అనారోగ్యంగా ఉందని డబ్బు ఫోన్ పే చేయిస్తానని రూ.లక్ష నగదు కావాలని అడిగాడు. డబ్బు వెంటనే వేయకపోతే ఆపరేషన్ చేయరంటూ అడగడంతో నిర్వాహకుడు తన వద్ద లేకున్నా, బయటి వ్యక్తుల వద్ద నుంచి తీసుకువచ్చి ఇచ్చాడు. ఇటీవల బాబు అకౌంట్‌ను బ్లాక్ చేశారు. అనంతరం కర్ణాటక పోలీసులు ఫోన్ చేసి హ్యాక్ చేసిన బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.లక్ష నగదును డ్రా చేశారని వెంటనే డబ్బు కట్టాలంటూ పోలీసులు సూచించారు. దీంతో తాను మోసపోయానని గమనించిన నిర్వాహకుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అప్రమత్తంగా ఉండాలి



ప్రజలు, మీ సేవ నిర్వాహకులు, బ్యాంక్ సేవా కేంద్రాల నిర్వాహకులు అపరిచిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలి. ఆర్థిక సాయం కోసం వచ్చినప్పుడు ఫోన్‌పే, గూగుల్ పే చేసినప్పుడు ఒకటికి రెండు సార్లు పరిశీలించాలి. హ్యాకర్స్ బారిన పడి మోసపోకూడదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తాం.

– బి.శ్రీనివాసులు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

సేవల్లో ఆదర్శం



కరోనా సమయంలో కూరగాయలు అందిస్తున్న వలంటీర్ తేజ

ఉరవకొండ: పట్టణానికి చెందిన వలంటీర్ మాల తేజ సేవలు పలువురికి ఆదర్శంగా నిలిచాయి. కరోనా సమయంలో పేదల జీవనం అస్తవ్యస్థంగా మారింది. ఎంతో మంది పేదలు పూట గడిపేందుకు నానా కష్టాలు పడ్డారు. అలాంటి తరుణంలో పట్టణంలోని సచివాలయం–2 పరిధిలోని కమ్మరవీధిలో పూట గడవని కుటుంబాలకు వలంటీర్ తేజ తన జీతంలో నుంచి సగం జీతం ఖర్చు పెట్టి కాయగూరలు, నిత్యావసర సరుకులు అందించి శభాష్ అనిపించుకున్నాడు. అలాగే దాతలు అందించిన నిత్యవసరాలు, ఇతర ఆహార పదార్థాలు ప్రతి ఇంటికీ చేర్చి గుర్తింపు పొందాడు. తేజ సేవలు మెచ్చి పలు స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా సత్కరించాయి.

వలంటీర్లకు వందనం

మమ్మల్ని ఆదుకున్నాడు



వలంటీరు తేజ కరోనా సమయంలో చేసిన సేవలు ఎంతో గొప్పవి. కరోనా సోకిన రోగులకు సమయానికి మందులు అందించి వారి బాగోగులు చూసేవాడు. దీంతో పాటు పూట గడవని కుటుంబాలను గుర్తించి తనకొచ్చే కొద్ది పాటి జీతంలోనే కాయగూరలు, నిత్యావసర సరుకులు అందించి కడుపు నింపాడు.

– గోరంట్ల సావిత్రమ్మ, కమ్మరవీధి, ఉరవకొండ

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

బొమ్మనహాళ్: మండల కేంద్రంలో సోమవారం ఉదయం 6 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె. ఈశ్వరరెడ్డి ఆదివారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు హాజరు కావాలన్నారు.

విడపనకల్లు: మండలంలోని పెద్ద కొట్టాలపల్లిలో సోమవారం ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు ఆదివారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలన్నారు.

విద్యార్థినికి ఆర్థిక చేయూత

కళ్యాణదుర్గం రూరల్: కిడ్నీ బాధిత విద్యార్థినికి దాతలు ఆర్థిక చేయూత అందించారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని మోరేపల్లికి చెందిన కిడ్నీ బాధితురాలు భారతి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమెత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ప్రతి నెలా వైద్యం కోసం కర్నూలుకు వెళ్లేదుకు ఆర్థిక సమస్య ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయుడు బద్దే నాయక్, అతని మిత్రులు సురేంద్ర, విజయ్ తమవంతుగా భారతి ఆస్పత్రి ఖర్చులకు రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. విద్యార్థి తండ్రి ఎర్రిస్వామి వికలాంగుడు. తల్లి కూలి పనులకు వెళ్తోంది. ఈ క్రమంలో విద్యార్థినికి వారు నగదు అందజేసి ఉదారత చాటుకున్నారు.

ఘనంగా మంత్రి జన్మదిన వేడుకలు



పార్టీ కార్యాలయంలో కేకు కట్ చేసి వేడుకలు చేసుకుంటున్న నాయకులు



ఆర్డీటీ ఆస్పత్రిలో రోగులకు అన్నదానం చేస్తున్న పార్టీ నాయకులు

కళ్యాణదుర్గం: రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, ఎంపీపీ మారుతమ్మ, జేసీఎస్ కన్వీనర్లు అర్చన, ఆంజినేయులు, సీనియర్ నాయకుడు సుధీర్‌తో పాటు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, వలంటీర్లు, గృహసారథులు కేకు కట్ చేశారు. అనంతరం స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే ఆర్డీటీ ఆసుపత్రి ఆవరణలో రోగులకు అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో కంబదూరు జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, సర్పంచు గుద్దెళ్ల బాపూజీ, నాయకులు లింగమయ్య, మల్లికార్జున, ఉమేష్‌రెడ్డి, సురేష్, ధను, షేక్షావలి, మారుతి, కిరీటి యాదవ్, జోసెఫ్ కిశోర్, పరమేశ్వరప్ప, హేమ, రూప, కేశవగౌడ్, మంజు, రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంబదూరు: ఉషశ్రీచరణ్ జన్మదిన వేడుకలను ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, బీసీ, రైతు విభాగాల జిల్లా ప్రధాన కార్యదర్శులు గోవింద్, నీలి శంకరప్ప, పార్టీ మండల కన్వీనర్ బాలరాజుయాదవ్, సర్పంచ్ సాకే తిమ్మప్ప కేక్ కట్ చేశారు.కార్యక్రమంలో ఎంపీటీసీలు మీసేవ కుమార్, మల్లేష్, భాస్కర్, బసప్ప, నాయకులు విల్సన్, రాజు, కిరణ్, మల్లికార్జున, క్రాంతి, వెల్ఫేర్ అసిస్టెంట్ శివలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతకు మారుపేరు బ్యాంకు ఓబుళేసు



ఓబుళేసు చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ తదితరులు

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడిగా పని చేసిన చల్లా ఓబుళేసు నిబద్ధతకు మంచితనానికి మారుపేరని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు, విశ్రాంత బ్యాంకు మేనేజర్ ఓబుళేసు సంస్మరణ సభ ఉరవకొండలోని ఉరగాద్రి కల్యాణ మండపంలో నిర్వహించారు. జెడ్పీ మాజీ సభ్యుడు సింగాడి తిప్పయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యేతోపాటు రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, పెన్నహోబిలం మాజీ చైర్మన్ అశోక్, గ్రామీణ బ్యాంకు విశ్రాంత ఆర్ఎం రంగన్న, విశ్రాంత బ్యాంకు మేనేజర్లు గోవిందరెడ్డి, బాలకృష్ణ, సుబ్బరాయుడు, ఫక్రుద్దీన్, మాజీ ఎంపీపీ నాగేశ్వరావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు. ఓబుళేసు చిత్రపటం వద్ద నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే విద్యార్థి దశ నుంచి ఓబుళేసుతో తనకున్న సానిహిత్యాన్ని గుర్తుచేసుకున్నారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

శాకంబరిగా చౌడేశ్వరీ అమ్మవారు

ఉరవకొండ: స్థానిక చౌడేశ్వరీ కాలనీలో చౌడేశ్వరీ అమ్మవారు శాకంబరీదేవి అలంకరణలో ఆదివారం భక్తులకు దర్శనిమిచ్చారు. అమ్మవారి జయంతి ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త చందా రాము ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ రకాల కాయగూరలతో శాకంబరిగా అలంకరించారు. ఆలయంలో ఈనెల 25న సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు ధర్మకర్త తెలిపారు.



మాది ప్రజా సంక్షేమ ప్రభుత్వం



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం రూరల్: మాది సంక్షేమ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలన సాగిస్తున్నారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని చదం గొల్లలదొడ్డి గ్రామంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డితో కలిసి ఆయన ఆదివారం రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ, ఎమ్మెల్యేలపై టీడీపీ నాయకులు బురద జల్లడం సిగ్గుచేటన్నారు. 40 ఏళ్ల రాజకీయానుభవం అని చెప్పుకుంటున్న 420 బొల్లి నాయుడుకు ప్రజల సంక్షేమం ఏనాడు పట్టలేదని ఆరోపించారు. మరోపక్క సచివాలయ, వలంటీర్ వ్యవస్థపై పవన్ కళ్యాణ్ కారు కూతలు కూస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో కాలవ శ్రీనివాసులు దోచుకోవడమే గాని ఏనాడు జేబులో నుంచి రూపాయి తీసి ప్రజల కోసం ఖర్చు పెట్టిన దాఖలాలు లేవన్నారు. మీకు మంచి చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, వచ్చే ఎన్నికల్లో ఓటువేసి రుణం తీర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బోర్‌వెల్ నాగిరెడ్డి, ఎర్రప్ప, తిప్పేస్వామి, మంజునాథ , తిమ్మరాజు, కోటి నాగరాజు, రాగాటి హనుమంతు, పూజారి హనుమంతు, విజయ్‌రెడ్డి, మల్లాపురం శివారెడ్డి, పవన్ , కోట గోవింద, ఎర్రెడ్డి, వంకాయల నాగప్ప, రామాచారి, శివలింగ, ఎంపీడీఓ కొండయ్య, పంచాయతీ కార్యదర్శులు బసవరాజు, భారతి, సీఐ లక్ష్మణ్ణ పాల్గొన్నారు.

పీఆర్ ఉద్యోగుల కృతజ్ఞతలు



విప్‌ను సన్మానిస్తున్న పీఆర్ కంప్యూటర్ ఆపరేటర్లు

మండలంలోని చదం గొల్లలదొడ్డిలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డిని పంచాయతీ రాజ్ శాఖలో కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ఆదివారం శాలువాతో సన్మానించి , కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ శాఖ డేటా ఎంట్రీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. నరేష్‌బాబు మాట్లాడుతూ సంవత్సర కాలం నుంచి పెండింగులో ఉన్న జీతభత్యాల సమస్యను విప్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. మా సమస్యను విన్న ఆయన ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ, పంచాయతీ రాజ్ కమిషనర్‌తో మాట్లాడి పెండింగులో ఉన్న 12 నెలల జీతభత్యాలను ఇప్పించారని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈసీ మెంబర్ హేమేంద్ర కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ అసోసియేషన్ అధ్యక్షులు టి.ప్రసాద్,ఉద్యోగులు రామేశ్వర్ రెడ్డి, గురుప్రసాద్ , దాదా అస్లాం, గణేష్ బాబు, పవన్ కుమార్, ప్రవీణ్ కుమార్, రంగమ్మ, భరత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' విజయవంతం చేయాలి

కళ్యాణదుర్గం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వలంటీర్లు మరింత బాధ్యతతో విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, జేసీఎస్ ఇన్‌చార్జ్ అర్చన, సచివాలయాల కన్వీనర్లు ఉమేష్‌రెడ్డి, మారుతి, కిరీటి యాదవ్, మంజు, జాకీర్ మాట్లాడారు. ప్రతి వార్డులో ఆయా వలంటీర్ల పరిధిలో సచివాలయం ద్వారా ఉచితంగా ధ్రువీకరణ పత్రాలను అందించాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి సచివాలయ సేవలపై వివరించాలన్నారు. అనంతరం వార్డుల వారీగా సంక్షేమ పథకాల అమలుపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని ఉప్పొంక గ్రామంలో ఆదివారం ఆకతాయిలు నిప్పు పెట్టడంతో వేరుశనగ పశుగ్రాసం అగ్నికి ఆహుతైంది. బాధిత రైతు మారెన్న తెలిపిన వివరాల మేరకు..గ్రామ సమీపంలో నిల్వ ఉంచిన నాలుగు ట్రాక్టర్ల వేరుశనగ పశుగ్రాసం (పొట్టు)కు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పేలోపు పశుగ్రాసం మొత్తం కాలిపోయింది. సుమారు రూ.60 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. అధికారులు స్పందించి ఆదుకోవాలన్నాడు.

సంక్షిప్త సమాచారం

వలంటీర్లకు క్షమాపణ చెప్పాలి

వజ్రకరూరు: ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తూ నిస్వార్థంగా సేవలు అందిస్తున్న వలంటీర్లపై టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ విమర్శలు చేయడం దారుణమని, వెంటనే వారు వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి కాకర్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం వజ్రకరూరులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ము ఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి చంద్రబాబు , పవన్‌కళ్యాణ్ ఓర్వలేకపోతున్నారన్నారు. వలంటీర్ల సేవలను గౌరవించాల్సిందిపోయి విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు పుట్టగతులుండవన్నారు.

కల్వర్టు పనుల పరిశీలన

ఉరవకొండ: పంచాయతీ పరిధిలోని 1వ వార్డు పాత బళ్లారి రోడ్డు వద్ద డ్రైనేజీపై రూ.6 లక్షల వ్యయంతో చేపట్టిన కల్వర్టు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఆదివారం కల్వర్టును సర్పంచ్ లలితమ్మ, ఎంపీపీ చంద్రమ్మ, జెడ్పీటీసీ పార్వతమ్మ, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు బసవరాజు పరిశీలించారు. సర్పంచ్ మాట్లాడుతూ 12 ఏళ్లుగా శిథిలావస్థకు చేరిన కల్వర్టును గత పాలకులు పట్టించుకోలేదన్నారు. కల్వర్టు లేక ప్రజలు పడుతున్న అవస్థలను మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి దృష్టికి తీసుకెళ్లగానే.. వెంటనే కల్వర్టు నిర్మాణ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు సలీం, వార్డు సభ్యులు పద్మావతి, భాను, అన్వర్, వడ్ల సలీం పాల్గొన్నారు.

'దళితుల పక్షపాతి సీఎం జగన్'

రాయదుర్గం: దళితుల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ కమిటీ సభ్యుడు బీటీపీ గోవిందు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పదవుల్లోనే కాదు.. పేదలకందించే సంక్షేమలోనూ సామాజిక న్యాయం పాటిస్తున్న ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ మాత్రమేనని గుర్తుచేశారు. అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించేలా కేబినెట్ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధనకర్తగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని ఆయన అభివర్ణించారు.

జగనన్న లే అవుట్లలో తాగునీటి సౌకర్యం

శెట్టూరు: మండల కేంద్రంతోపాటు మండలంలోని మాకోడికి గ్రామంలోని జగనన్న లే అవుట్లలో తాగునీటి సౌకర్యం కల్పించారు. శెట్టూరులో ఎంపీపీ లక్ష్మీదేవమ్మ, మాకోడికిలో సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి, ఎంపీటీసీ గీతమ్మ ఆధ్వర్యంలో శనివారం రాత్రి బోరు వేశారు. రెండు చోట్లా సమృద్ధిగా నీరు పడినట్లు వారు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని గొంచిరెడ్డిపల్లి జగనన్న కాలనీలో నీటి సమస్య ఉందని లబ్ధిదారులు మంత్రి ఉషశ్రీ చరణ్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం జగనన్న కాలనీలో బోరు వేయించగా మూడు ఇంచుల నీరు పడింది. కార్యక్రమంలో సర్పంచ్ తలారి గోవిందప్ప, వైస్ సర్పంచ్ నాగేష్, గ్రామస్తులు ప్రతాప్‌రెడ్డి, చన్నమల్ల, గొల్లచిత్తప్ప తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



కళ్యాణదుర్గం: డిగ్రీ కళాశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు



శెట్టూరు: ఉన్నత పాఠశాలలో కలుసుకొన్న పూర్వ విద్యార్థులు

కళ్యాణదుర్గం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1969 నుంచి 1976 మధ్య కాలంలో ఇంటర్ చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహిచారు. ఇందుకు ప్రభుత్వ ఎస్వీజీఎం డిగ్రీ కళాశాల ఆవరణ వేదికయింది. సుమారు 150 మందికిపైగా పూర్వ విద్యార్థులు వివిధ ప్రాంతాల నుంచి హాజరై తమ సహచరులతో నాటి మధురానుభూతులను స్మరించుకున్నారు. అనంతరం ప్రస్తుత ప్రిన్సిపాల్ జయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటనాయుడు, వెంకటసుబ్బయ్య, సుబ్రమణ్యం, నాగభూషణం, వాదిరాజరావు, శ్రీరాములు, తిప్పేస్వామి, ఆంజినేయులు తమ అనుభవాలను వివరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ బి.శ్రీనివాసులు గురువుల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం అప్పటి గురువులను, ప్రస్తుత గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, విశ్రాంత అధ్యాపకులు మల్లికార్జున, కరణం మల్లికార్జునబాబు, పాండురంగ, భగవాన్‌దాస్, తిప్పేస్వామి, జీపీ నారాయణ, లింగప్రసాద్, బుట్నా తిమ్మరాజు, శ్రీనివాస ప్రసాద్, హంపన్న తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1991–92లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. గత స్మృతులను గుర్తు చేసుకుని సంబరపడ్డారు. అప్పటి ఉపాధ్యాయులు మాధవరెడ్డి, వేణుగోపాలకృష్ణ, మల్లేశ్వరరెడ్డి, ఇషాక్‌ను సన్మానించారు. పూర్వ విద్యార్థులు షిరోజ్‌ఖాన్, మురళి, రఘు, తదితరులు పాల్గొన్నారు.